క్లుప్తంగా

ఉత్తమ సేవలకు అవార్డు స్వీకరించిన డాక్టర్



చంద్రాల(మైలవరం): మైలవరం మండలం చంద్రాల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆర్. నరేష్ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు నుంచి ఉత్తమ డాక్టర్ అవార్డును అందుకున్నారు. చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కోవిడ్ పరీక్షలు నిర్వహించడం, కోవిడ్ పేషంట్స్‌కు సకాలంలో వైద్య సేవలు, కోవిడ్ వ్యాక్సినేషన్, గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రతలు తీసుకోవడం, లెప్రసీ సర్వే తదితర సేవలు, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ప్రతి గ్రామాల్లో రోగులకు వైద్య సేవలు అందించినందుకుగానురిపబ్లిక్ డే సందర్భంగా అవార్డు అందుకున్నారు. చంద్రాల పీహెచ్‌సీలో ఆసుపత్రి వైద్య సిబ్బంది శుక్రవారం డాక్టర్ నరేష్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నూజివీడు: మండలంలోని గొల్లపల్లిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శనివారం శంకుస్థాపన చేస్తారని మాజీ సర్పంచి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఎస్టీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. రక్షిత మంచినీటి పథకం, అంగన్‌వాడీ భవనం, బల్క్ మిల్క్ సెంటర్ నిర్మాణాలకు ఉదయం 10.30 గంటలకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గుడి మళ్లకృష్ణంరాజు,ఎంపీపీ ఆరేపల్లి శిరీష పాల్గొంటారని,ప్రజాప్రతినిధులు,అధికారు లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనాలని కోరారు.

సచివాలయంలో రికార్డుల పరిశీలన



నరసాపురం (విస్సన్నపేట): మండలంలోని నరసాపురం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలో సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న రికార్డులను ఎంపీడీఓ పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైనవారందరికి అందాలన్నారు. జగనన్న చేదోడుకు సంబంధించి పెండింగ్ లేకుండా చూడాలన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక



జూపూడి(ఇబ్రహీంపట్నం): నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జరిగిన క్యాంపస్ సెలక్షన్స్‌లో 10 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ అక్బర్‌ఖాన్ తెలిపారు. 50 మంది నాలుగో ఏడాది ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు బెంగుళూరుకు చెందిన కోడ్‌నెస్ట్ కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్‌లు నయన్‌కుమార్, హార్ష వివిధ విభాగాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రతిభ కలిగిన 10 మందిని ఎంపికచేసి నియామక పత్రాలుఅందజేశారు. అకడమిక్ డైరెక్టర్ టి.నారా యణమూర్తి, ప్లేస్‌మెంట్ అధికారి అబ్దుల్ బాజీ, కంప్యూటర్ విభాగాధిపతులు డాక్టర్ మిని, డాక్టర్ సయ్యద్ సాదత్‌ఆలీ ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

నేడు మండల పరిషత్ సమావేశం

చాట్రాయి: స్థానిక మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశం ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.మురళీమోహన్‌రావు శుక్రవారం తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే సమావేశానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని పేర్కొన్నారు.

రాజకీయాలకు అతీతంగా ‘సంక్షేమం’

- తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి
- ఎర్రమాడులో గడప గడపకు మన ప్రభుత్వం



తిరువూరు మండలం ఎర్రమాడులో లబ్ధిదారుడికి బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: రాజకీయాలకతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేవిధంగా ప్రభుత్వం కృషిచేస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. శుక్రవారం తిరువూరు మండలంలోని ఎర్రమాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలను ఇంటింటికీ తిరిగి కలిశారు. వారికి ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలను వివరించి బ్రోచర్లు అందజేశారు. ప్రతి అర్హులైన లబ్ధిదారులకు పథకాల ద్వారా లబ్ధి చేకూరే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వమూ చేయని విధంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. క్షేత్రస్థాయిలో అర్హుల గుర్తింపునకు వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది కృషిచేస్తున్నారని పేర్కొనారు.

ఇప్పటికీ పథకాలు అందని అర్హులు ఉంటే సచివాలయంలో సంప్రదించాలని సూచించారు. ఎర్రమాడు గ్రామంలో గత 4 సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమాలను వివరించారు. ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, గ్రామ సర్పంచి బొర్రా మాధవి, పీఏసీఎస్ అధ్యక్షుడు కొమ్మినేని కిషోర్, బండి రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు బొర్రా మోహనరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా వారోత్సవాలు ప్రారంభం



ఇబ్రహీంపట్నం సభలో మాట్లాడుతున్న మేనేజర్ సుబ్రహ్మణ్యం, తదితరులు

ఇబ్రహీంపట్నం: రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రయాణం సురక్షితంగా ఉంటుందని ఆర్టీసీ డిపో మేనేజర్ ఏ.సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో ఎస్ఐ శ్రీనివాస్‌తో కలసి రోడ్డు భద్రతా వారోత్సలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అప్పుడప్పుడు డ్రైవర్ల కొద్దిపాటి నిర్లక్ష్యంతో నిండుప్రాణాలు పోయే ప్రమాదం ఉందన్నారు. వచ్చేనెల 2వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. కొండపల్లి రైల్వే స్టేషన్ నుంచి విజయవాడ రైల్వే స్టేషన్‌కు తెల్లవారుజామున బస్ సర్వీసు ప్రారంభించినట్లు తెలిపారు. ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రైవర్లు విధి నిర్వాహణలో నిబంధనలు పాటించాలన్నారు. అసిస్టెంట్ డిపో మేనేజర్ శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

సాగులో మెలకువలు పాటించాలి

జిల్లా వ్యవసాయాధికారి విజయభారతి



మునుకుళ్లలో రైతులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి విజయభారతి

మునుకుళ్ల(తిరువూరు): పంటల సాగులో మెలకువలు పాటిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయాధికారిణి విజయభారతి రైతులకు సూచించారు. మండలంలోని మునుకుళ్లలో శుక్రవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. పంటలను నాశనం చేసే పురుగులను గుర్తించడానికి లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. శత్రు పురుగులను నాశనం చేసేందుకు మాత్రమే పురుగు మందులను పిచికారీ చేయాలని సూచించారు. పంటలకు మేలు చేసే మిత్రపురుగులను వృద్ధి చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వం డ్రోన్లను సబ్సిడీపై అందించడంతో పాటు పైలట్‌కి ఉచితంగా శిక్షణ కూడా ఇస్తారన్నారు. తిరువూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కెనడీ, ఏవో పద్మ, మునుకుళ్ళ పీఏసీఎస్ చైర్‌పర్సన్ గోపిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

తమ్మిలేరు కాలువకు నీరు విడుదల

ముసునూరు: తమ్మిలేరు కాలువకు నీటి విడుదలతో ముసునూరు మండలంలోని చెరువులు జలకళ సంతరించుకున్నాయి. మండలంలోని తమ్మిలేరు పరీవాహక గ్రామాలైన లోపూడి, గుళ్లపూడి, గుడిపాడు, వలసపల్లి, యల్లాపురం, బలివే, వెంకటాపురం, వేల్పుచర్ల గ్రామాల్లోని రైతులు వేసవిలో పంటలకు సాగునీరు, పశువులకు తాగునీటి కొరత తీర్చాలని ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావును వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. తక్షణమే స్పందించిన ఆయన నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో చర్చించి మంకొల్లులోని తమ్మిలేరు రిజర్వాయర్ నుంచి ఏటి కాలువకు నీరు విడుదల చేయించారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, యూత్ అధ్యక్షుడు గూట్ల రంగారావు ఆధ్వర్యంలో శుక్రవారం తెలిపారు. జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, ఎంపీపీ రాపర్ల కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్‌లు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాల సాగుకు అనేక రాయితీలు

- చిరుధాన్యాల పంటలకు ఉచిత భీమా
- చిరుధాన్యాల ఉత్పత్తులకు మార్కెటింగ్‌లో మరెన్నో అవకాశాలు
- నందిగామ సహాయ వ్యవసాయ సంచాలకుడు రమణమూర్తి



పరిటాల రైతు భరోసా కేంద్రంలో చిరుధాన్యాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రమణమూర్తి

కంచికచర్ల: అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023 పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలంలోని పరిటాల రైతు భరోసా కేంద్రం వద్ద శుక్రవారం ‘చిరు ధాన్యాలు క్లస్టర్ గ్రూప్‌ల ఏర్పాటు, చిరుధాన్యాలు ఆరోగ్యంపై చూపే సత్ఫలితాలు’ అనే అంశంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నందిగామ సహాయ వ్యవసాయ సంచాలకుడు ధర్మపురి రమణమూర్తి మాట్లాడుతూ ప్రపంచ చిరుధాన్యాల ఉత్పత్తిలో 20 శాతం, ఆసియా ఖండం ఉత్పత్తిలో 80 శాతం మన దేశం వాటా కలిగి ఉందన్నారు. మన దేశం చూపిన ప్రత్యేక చొరవతోనే ఐక్యరాజ్యసమితి ఈ సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా గుర్తించిందన్నారు. 8 రకాల చిరు ధాన్యాలలో జొన్నసాగు ఈ ప్రాంతానికి అనుకూలంగా ఉందన్నారు. చిరుధాన్యాలు సాగుచేసే ప్రతి క్లస్టర్ రైతుకు ప్రతి హెక్టార్‌కు రూ.6వేలు చొప్పున వివిధ వనరులు, వ్యవసాయ పనిముట్లను రాయితీపై ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రూ.1.50లక్షలు సబ్సిడీపై ప్రాసెసింగ్ యూనిట్లను రాయితీపై అందిస్తామని చెప్పారు. ఈ పంటలను ఉచిత బీమా పథకంలో చేర్చటమే కాకుండా వీటికి బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం ఇప్పించటం, కనీస మద్దతు ధర లేని వాటికి క్వింటాకు రూ.2,500 నగదు ఇప్పిస్తామన్నారు. చిరుధాన్యాల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలను మెరుగుపర్చేవిధంగా (అపెడ) వారి సౌలభ్యంతో జియో, మా, మెట్రో మార్ట్‌లతో కలసి అమ్మకాలు చేపడతామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజన పథకంలో ఈ ఉత్పత్తులతో కనీసం వారానికి రెండు రోజులు మెనూలో చేర్చి అంతర్గత మార్కెటింగ్ అవకాశాలు మెరుగుపరుస్తామన్నారు. గరికపాడు కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ నంద్యాల పరిశోధన కేంద్రంలో జొన్న ఇతర చిరుధాన్యాలపై పరిశోధనలు, విత్తనోత్పత్తి జరుగుతోందని, విత్తనాలు కావల్సిన రైతులు సంప్రదించాలన్నారు.

హోం సైన్స్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ దిగుబడుల మీద విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసే విధానం గురించి ఏ రకంగా విలువ జోడించవచ్చో తెలిపారు. అనంతరం చిరుధాన్యాల ఉత్పత్తుల ప్రదర్శన రైతులకు చూపించారు. ఎంఏవో కె.విజయకుమార్, శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటరెడ్డి, శివప్రసాద్, రాజనరసింహ, వ్యవసాయ సహాయకులు రఘు, చంద్రశేఖర్, సొసైటీ అధ్యక్షుడు మాగంటి వినయభూషణరావు, నెమలిపురి అమ్మారావు, కమిటీ నాయకులు చింతా రవీంద్రనాథ్, బత్తుల శేషయ్య, కర్ల రామకృష్ణ, ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

ఆర్డీవోకు పలువురి అభినందనలు



నందిగామ: గణతంత్ర దిన వేడుకలలో భాగంగా జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న నందిగామ ఆర్డీవో రవీంద్రరావును శుక్రవారం పలువురు అభినందించారు. డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, సిబ్బంది కార్యాలయానికి వచ్చి ఆర్డీవోను అభినందించారు. కార్యక్రమంలో నందిగామ, చందర్లపాడు తహసీల్దార్ లు నరసింహారావు, సుశీల, డెప్యూటీ తహసీల్దార్ రిప్కా రాణి, పలు కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

30న వైఎస్సార్ విగ్రహావిష్కరణ

ఆగిరిపల్లి: మండలంలోని ఈదులగూడెం డిప్ సెంటర్‌లో ఈ నెల 30న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు శుక్రవారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని, అనంతరం భారీ అన్నసమారాధన ఉంటుందని చెప్పారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులంతా హాజరుకావాలని కోరారు. సమావేశంలో మండల ఇన్‌చార్జి మద్దా హరిబాబు, ఈదులగూడెం పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఈలప్రోలు వెంకట సుబ్బయ్య, కలటూరు, సీతారామపురం సర్పంచ్‌లు రాఘవరపు సురేష్, అత్తి మురళీ, నాగుల్ మీరా, ఎంపీటీసీ గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, పథకాలపై ప్రచారం చేయండి



వలంటీర్లతో సమావేశం నిర్వహిస్తున్న సచివాలయ కన్వీనర్లు

నూజివీడు: అభివృద్ధి, సంక్షేమ పథకాలపై వలంటీర్లు ప్రచారం చేయాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము అన్నారు. స్థానిక గాంధీనగర్ సచివాలయ వలంటీర్లతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఎన్నికల హామీలన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చిందని చెప్పారు. సచివాలయాల కన్వీనర్లు పిళ్లా చరణ్, కొండా వెంకటరావు, కోటగిరి పూర్ణిమ, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జి.కొండూరు: జి.కొండూరు టౌన్‌ఫీడర్ మరమత్తుల కారణంగా శనివారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సీహెచ్ రామ్మోహనరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జి.కొండూరు, పినపాక, కట్టుబడిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

పూరిల్లు దగ్ధం



రెడ్డిగూడెం: మండలంలోని రెడ్డిగూడెం ఎస్సీ కాలనీలో పల్లెపాం కిషోర్‌కు చెందిన పూరిల్లు శుక్రవారం విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. విద్యుత్ షార్టు సర్క్యూట్ జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అందుబాటులో ఎవరూ లేకపోవడంతో ఇంటిలో ఉన్న దుస్తులు, సామగ్రితో సహ పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో బాధితులు నిరాశ్రయులయ్యారు.

సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి

డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్

నూజివీడు: ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చాలని డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్ అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా స్థానిక ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ కార్మికులకు శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల్లో నూటికి 90 శాతం ప్రమాదాలు మానవ తప్పిదాల వల్లే సంభవిస్తున్నాయన్నారు. డ్రైవర్లు మద్యం సేవించి విధులకు రావద్దని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నప్పుడు కేసు నమోదైతే రూ.వెయ్యి జరిమానా లేదా డ్రైవింగ్ లైసెన్సును తాత్కాలికంగా రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రమాదాల వల్ల కుటుంబాలలో వృద్ధులకు దిక్కులేకుండా పోతోందని, పిల్లలు అనాథలవుతున్నారని, అంగవైకల్యం ఏర్పడి జీవితాంతం ఇబ్బందులు పడాల్సి వస్తోందని అన్నారు. నిబంధనలను పాటిస్తూ వాహనాలను నడిపి ప్రమాదాలను అరికట్టాలని సూచించారు. డీఎం. సీహెచ్ సూర్య పవన్ కుమార్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే సంపూర్ణ అభివృద్ధి

ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ

జి.కొండూరు: రాజకీయాలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రజల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించుకోవచ్చని ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ అన్నారు. మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనులపై వివరణ ఇచ్చారు. పలు సమస్యలపై పరిషత్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు ఇచ్చిన వినతులను అధికారులు స్వీకరించారు. ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ గత సమావేశంలో చేసిన తీర్మానాలపై పురోగతిని సమీక్షించారు. వేసవి సమీపిస్తున్న క్రమంలో ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో నీటి సమస్యలు ఎక్కడ ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. డీఎల్‌డీఓ అనూరాధ మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీరు వ్యవస్థ అద్భుతంగా పని చేసి ప్రభుత్వ కార్యకలాపాలు, పథకాలను ప్రతి లబ్ధిదారుడుకి కొన్ని గంటల వ్యవధిలోనే అందించగలుగుతున్నారని వివరించారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేస్తున్న ఈ కృషికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కూడా తమ వంతు తోడ్పాటును అందించాలని కోరారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు సభ్యులు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావు, ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ వేములకొండ రాంబాబు, ఎంపీడీఓ అనూరాధ, తహసీల్దార్ రోహిణీదేవి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

చేపల చెరువుల నుంచి దుర్వాసన

కోళ్ల వ్యర్థాల నిల్వలతో ఇబ్బంది అంటున్న గ్రామస్తులు



వెల్వడం చేపల చెరువు వద్ద నిలువ ఉంచిన కోళ్ల వ్యర్థాలు

వెల్వడం(మైలవరం): వెల్వడం సమీపంలో ఏర్పాటు చేసిన చేపల చెరువుల నుంచి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైలవరం మండలం వెల్వడం, గణపవరం గ్రామాల మధ్య సుమారు 35 ఎకరాలు వ్యవసాయ భూములను వ్యాపారులు లీజుకు తీసుకుని చేపల చెరువులుగా మార్చారు. చెరువుల్లో చేపలు పెరగడానికి ఆహారంగా కోళ్ల వ్యర్థాలను ఉడకబెట్టి వేస్తున్నారు. అందుకు గాను సమీపంలోని కోళ్ల ఫారాల్లో మృతి చెందిన కోళ్లు, చికన్ సెంటర్ల నుంచి వ్యర్థాలను సేకరించి నిలువ ఉంచుతున్నారు. దీంతో కోళ్ల వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వస్తుండటంతో సమీపంలో నివశించే వారు, వాహన చోదకులు ఈ దుర్వాసన భరించలేకపోతున్నారు. రోగాల బారిన పడతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలకు సమీపంలో చేపల చెరువులకు అనుమతులు ఎలా ఇచ్చారని గ్రామస్తులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం



నెమలి శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానం

నెమలి(గంపలగూడెం): జిల్లాలో విశిష్ట ఆలయమైన గంపలగూడెం మండలం నెమలి శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో శనివారం విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం, రథసప్తమి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, సహాయ కమిషనర్ కే శాంతి తెలిపారు. 1958లో రథసప్తమి నాడు ఆలయంలో విగ్రహ ప్రతిష్టలు చేశారు. నాటి నుంచి ప్రతియేటా రథసప్తమి రోజు ప్రతిష్టా వార్షికోత్సవం నిర్వహిస్తారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు, అర్చకబృందంచే ప్రారంభిస్తారు. స్వామికి పంచామృతాలు, నవరసఫలాలతో అభిషేకం, ప్రత్యేక అలంకరణ , పూజలు నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా శ్రీగోపాల లక్ష్మి సుదర్శన హోమం, సూర్యనారాయణ మహామంత్ర హోమం నిర్వహిస్తామన్నారు.

నేడు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



విస్సన్నపేట: మండలంలోని తెల్లదేవరపల్లి తండాలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శనివారం ఉదయం 9.38 గంటలకు ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ట నిర్వహించనున్నారు. దీంతోపాటు ధ్వజ స్తంభం ప్రతిష్టా మహోత్సవం కూడా జరగనుందని తెల్లదేవరపల్లి తండా భక్తబృందం శుక్రవారం తెలిపారు. ఆలయం వద్ద భక్తులకు అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేసామన్నారు.

డెప్యూటీ కలెక్టర్‌గా వెళుతున్న తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ నాగేశ్వరరావును సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల ట్రిబల్ వెల్ఫేర్ విభాగం ఏలూరుకు డెప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతిపై వెళుతున్న కె.నాగేశ్వరరావుకు శుక్రవారం రాత్రి ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ వారి కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది ఏర్పాటుచేసిన ఆత్మీయ అభినందన కార్యక్రమంలో నాగేశ్వరరావు దంపతులను పలువురు ప్రముఖులతో పాటు, రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. నందిగామ ఆర్డీవో రవీంద్రరావు, పేట ఎంపీడీవో జయచంద్ర, పట్టణ ఎస్ఐ రామారావు, వీఆర్‌వోల సంఘం జిల్లా అధ్యక్షుడు రాటకొండ శ్రీనివాసరావు, టీడీ నాగరాజు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు)
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda
బ్యాంక్ ఆఫ్ బరోడా
నూజివీడు బ్రాంచ్, #17-248, చిన్న గాంధీ బొమ్మ సెంటర్, బస్ స్టాండ్ రోడ్డు, నూజివీడు, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521 201

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002తో కలిపి చదవబడే సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 6(2) & 8(6) లోని నిబంధనల క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు అమ్మకం ప్రకటన)
[illegible]

రుణగ్రహీత/హామీదారుల పేర్లు మరియు చిరునామా	స్థిరాస్తి వివరములు	మొత్తము బకాయి	ఇ-వేలం తేది మరియు సమయం	రిజర్వు ధర, ధరావతు మరియు బిడ్ పెంపుదల
రుణగ్రహీత : శ్రీ బండి మధు సూదన్ రావు, [illegible] మారుతీ, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521201 హామీదారు : శ్రీమతి బండి సుమలత, [illegible]	షెడ్యూల్-ఎ: కృష్ణా జిల్లా, నూజివీడు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, [illegible] 801 చదరపు గజాల స్థలంలో 42.9 [illegible]	రూ.81,12,362.88 పై [illegible]	28-02-2023 ఉ॥ 02.00 గంటల నుండి సా॥ 06.00 గంటల వరకు [illegible]	రిజర్వు ధర: రూ.31,80,000/- ధరావతు: రూ.3,18,000/- బిడ్ పెంపుదల రూ.10,000/- తనిఖీ తేది.23-02-2023 ఉ॥11.00 గంటల నుండి సా॥ 04.00 గంటల వరకు

[illegible]

అమ్మకం పూర్తి నిబంధనలు మరియు షరతుల కొరకు మా వెబ్ సైట్ :https://www.bankofbaroda.in/e-auction.htm లో [illegible] https://ibapi.in [illegible] శ్రీ బి. హనుమంతరావు, చీఫ్ మేనేజర్, మొబైల్ నెం.94418 46726 ను సంప్రదించగలరు.

తేది : 27-01-2023, ప్రదేశం : నూజివీడు | సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా